# లెక్కల మాష్టారు

"యింత జొరంలో స్కూల్ కెళ్తానంటావేమిటే ముదనష్టపు దానా - నీకేమైనా పిచ్చెక్కిందా?"

పధ్నాలుగేళ్ళ షబ్నం చిరాగ్గా చూసింది అమ్మవైపు - వూహ తెల్సినప్పటినుండి అమ్మ కంఠంలో ఆ విసుగూ - కోపం వింటూనే ఉంది. జీవితంలో ఎప్పుడైనా అమ్మ మృదువుగా మాట్లాడి ఉంటుందా అని కొన్ని సెకండ్లు ఆలోచించింది.

యెంత అసహ్యమో తనకు- తాగితేనే కాని మాటలురాని - మాట్లాడినపుడల్లా బూతులు తప్ప మరో భాష తెలీని నాన్న - తన్నులు తింటూ భర్తనీ, పిల్లల్నీ చివరికి తనని కూడా తాను తిట్టుకునే అమ్మ ... ప్చ్...

ఒక్క మృదు పలుకు - ఓ తీయటి మాట - ఓ చల్లటి వాత్సల్యంతో కూడిన చిర్నవ్వు... హు...

బలాన్నంతా కూడగట్టుకుని లేచింది షబ్నం. ఈ నరకంకన్నా ఆ స్కూలే నయం - పాఠాలు చెప్తారు. పరుషమైన పదాలు లేని - తిట్లు కానివేటినైనా - పాఠాలైనా సరే - వింటుంటే ఎంత హాయి..

"యెక్కడికే లేచావు - ఖబరస్తాన్‌కా" విరుచుకుపడింది అమ్మ. షబ్నంకు అలవాటైపోయింది. ఆ కంఠంలో ప్రేమ ధ్వనిస్తే విపరీతం.. విడ్డూరం.. అయినా నడిచే శవాలు తిరిగే ఈ యింటికన్నా శ్మశానం వేరెక్కడుంది అనుకుంది.

"చదువుకుని యేం చేస్తుందిరా-ఈ ముండతో చెప్తూనే ఉన్నాను. ఆడపిల్లని కనొద్దేఅని.. నామీదికక్షతో కనిపడేసింది. థూ..." బీడిముక్కని తుపుక్కున వూసి - లేచి నిలబడ్డాడు నాన్న.

జరుగబోయే అతి అసహ్యమైన తగాదాకి నాంది ప్రస్తావనలా అన్పించింది షబ్నంకు.

యిపుడు ఇద్దరూ తిట్టుకుంటారు. పోట్లాడుకుంటారు. "ఆడపిల్లని యెందుకు కన్నావే? రేపు నిఖా ఎలా చేస్తావు? పదిమంది దగ్గరపడుకుని సంపాదిస్తావా లాంటి వినకూడని - విన్నా విషంతాగి చచ్చిపోతే బావుండుననుకునే భయంకరమైన మాటలు ఈటెల్లా విసురుకుంటారు. ఆ తర్వాత రక్తాలు కారేలా కొట్టుకుంటారు.

బట్టలు మార్చుకుని - పుస్తకాలు సంచిలో సర్దుకుంది. రెండ్రోజులైంది స్కూలుకెళ్ళి - ఈ రోజు ఏమైనా సరే స్కూలు కెళ్ళాల్సిందేనన్న పట్టుదల షబ్నంలో.. జ్వరం కాదు కదా - మరణం కూడా ఆపలేదీ రోజు....

స్కూలుకెళ్ళాలన్న కోరికలో అరవైశాతం ఆక్రమించుకుంటూ లెక్కల మాష్టార్ని చూడాలన్న కోరిక... అమ్మో... రెండ్రోజులైంది చూసి - ఆ చిర్నవ్వుని - ఆ అందమైన ముఖాన్ని - అల్లరిగా నవ్వే ఆ కళ్ళనీ - అతి మృదువైన ఆ కంఠస్వరాన్ని.

షబ్నం పెదవులు అలవోకగా విచ్చుకున్నాయి.

"గులాబ్ - రెండో యెక్కం చెప్పు" అనేవారు మాష్టారు - తన చిన్నప్పుడు.

"నా పేరు షబ్నం" అంటే - అందంగా నవ్వి "నీవు గులాబీ మొగ్గలా అందంగా ఉంటావు - ఆ బుగ్గలు చూడు గులాబీ రేకుల్లా.. గులాబీ పూపుమీది మంచు బిందువు షబ్నం" అనేవారు మధురమైన కవిత్వం చెప్తున్నట్లు.

షబ్నం వాళ్ళుండే ఆ పల్లెటూర్లో మొదట ప్రాధమిక పాఠశాల మాత్రమే ఉండేది. దాన్నిప్పుడు అప్పర్ ప్రైమరీ స్కూలు చేశారు. తన చిన్నప్పుడు కూడా మాష్టారు లెక్కలు చెప్పటమే తనకు బాగా గుర్తు. ఇప్పుడు యేడో తరగతికి లెక్కలు చెప్తారు. ఆయన్నందరూ శర్మ మాష్టారూ అంటారు. తనకు మాత్రం ఆయన లెక్కల మాష్టారే.

"పొరపాటున పేదింట్లో పుట్టావు షబ్నం - లేకపోతేనా... పర్షియన్ రాకుమారిలా ఉండేదానివి. అపుడందరూ నీ సౌందర్యానికి బానిసలై నిన్ను నూర్‌జహాన్ అని పిల్చేవారేమో' ' అనే లెక్కల మాష్టారంటే షబ్నంకు ప్రాణం. మాష్టారి మాటలు వింటుంటే ఆకలి - పేదరికం - కొట్లాటలు - తిట్లు... ఏవీ గుర్తుకు రావు. వాటికి సుదూరంగా - ఓ సుందరలోకంలోకి -

స్వర్గధామం లాంటి చోటికి లాక్కెళ్ళిపోతాయా మాటలు.

యెంత చల్లగా చూస్తారు! ఆ కళ్ళలోంచి అమృతం కురుస్తున్నట్లు - తేనేధారలా ఎంత తీయగా మాట్లాడతారు!

మేష్టారి సాన్నిధ్యమే కాదు - మేష్టారి ఆలోచనలు, జ్ఞాపకాలు కూడా ఎంత మధురంగా ఉంటాయో....

వెనుకనుండి విన్పిస్తున్న తిట్లని ఖాతరు చేయకుండా అడుగు బైటకు పెట్టిన షబ్నం ఆగిపోయింది.

యెదురుగా శర్మ మాష్టారు...

షబ్నంని చూడగానే మాష్టారి పల్చటి పెదాలు మృదువుగా విచ్చుకున్నాయి.

ఆ నవ్వంటే షబ్నంకెంతిష్టమో... జీవితం అంతా ఆ ఒక నవ్వుని పొందిన అనుభవంతో తృప్తిగా గడిపేయవచ్చు.

"మై స్వీట్ - మై లిటిల్ చైల్డ్ - అలా వాడిపోయావేం... ఆరోగ్యం బాగాలేదా? రెండ్రోజుల్నించీ స్కూలుకి రాకపోతే ఆదుర్దా పడి - ఉండబట్టలేక, స్కూలు కెళ్ళేముందు ఓసారి చూసిపోదామని వచ్చాను" మాష్టారు ప్రేమగా తల నిమురుతూ చెప్పారు.

నుదుటి మీద చేతిని ఉంచి దాన్ని బుగ్గల మీదుగా జార్చారు.

ఎంత హాయిగా ఉందో షబ్నం మనసుకి... మంచువానలో తడిసే సూర్యకిరణంలా.. యేటి ఎదను తాకే చిరుగాలి స్పర్శలా....

"వళ్ళు కాలిపోతోంది - యింత జ్వరంలో స్కూలుకి బయల్దేరావా - పోయి రెస్ట్ తీసుకో - మందులు ఏమైనా వాడుతున్నావా?" మందలింపుగా, అందులో ప్రేమని మిళితంచేసిన మాష్టారి మాటలకు, మంత్రముగ్ధలా కదిలివెళ్ళి, వసారాలోని మంచంమీద పడుకుంది.

అప్పటివరకూ భాషలోని అసహ్యమైన పదాలన్నీ వాడటం అయిపోయిన అమ్మా, నాన్నా బైటికొచ్చారు.

మాష్టారు మంచంమీద కూచుని, షబ్నం నుదుటిమీద పడ్తున్న జుట్టుని ఆత్మీయంగా సవరించారు.

తన్మయత్వంతో కళ్ళు మూసుకుంది షబ్నం. హాయిగా నిద్రవస్తోంది - పసితనంలో అమ్మపాలు త్రాగేటప్పటి అనుభూతి...

"అనారోగ్యంగా ఉన్న పిల్లని స్కూలు కెందుకు పంపిస్తున్నారండీ" అన్నారు షబ్నం వాళ్ళ నాన్నవైపు చూస్తూ...

షబ్నం చెవుల్లో తీయటి పాట విన్పిస్తోంది

ఎంతటి గొప్ప సంస్కారం ! వారికి తరతమ భేదాలు లేవు - పేదా గొప్పా తేడాలు తెలియవు. అందుకే అందరినీ ప్రేమగానే పల్కరిస్తారు - అందరితో మృదువుగానే మాట్లాడతారు.

"మేము వద్దంటున్నా వినకుండా బయల్దేరిందయ్యా - మొండిపిల్ల" అంది అమ్మ.

మాష్టారు మెత్తగా నవ్వారు - అద్భుతమైన నవ్వు ... పూర్వకాలంలో మంత్రాలతో మోడు వారిన చెట్లని చిగిర్చేవారట. కొంతమంది సంగీతంతో వసంతాన్ని లాక్కొచ్చేవారట - మాష్టారి నవ్వు చూస్తే అవన్నీ కల్పితాలు కావని - ఆ నవ్వుతో మృత్యువులో జీవచైతన్యాన్ని కలిగించవచ్చుననీ నమ్మకం ఏర్పడుతుంది.

"షబ్నంకు చదువంటే అంతులేని ఆసక్తి - చాలా చురుకైన పిల్ల - ఎట్టి పరిస్థితుల్లోనూ చదివించటం మానకండి - ఇప్పటికే మీ అశ్రద్ధ వల్ల తొమ్మిదో తరగతిలో ఉండాల్సిన పిల్ల ఏడో తరగతిలో ఉంది - వచ్చే సంవత్సరం నుంచి మన స్కూల్లోనే పదో తరగతి వరకూ క్లాసులు పెంచుతున్నారు" అన్నారు మాష్టారు.

"కూలినాలి చేసుకుని బతికేటోణ్ణి - ఆడపిల్లనెంతని చదివించగల్ను - వచ్చే యేడు నిఖా చేయించేస్తా, బరువు తీరిపోతుంది" అన్నాడు నాన్న.

"అంత పనిచేయకండి - తెలివితోపాటు, చదువుమీద శ్రద్ధ ఉన్న పిల్లల్ని మనం ప్రోత్సహించాలి తప్ప అలా చదువు మాన్పించకూడదు. అయినా పెళ్ళికేం తొందరొచ్చింది-

ఇంకా చిన్నపిల్లేకదా!"

తదేకంగా మాష్టారివైపే చూస్తోంది షబ్నం.

మాష్టారు అలా మాట్లాడుతూ ఉంటే ఆగకుండా ఆ మాటలు అలా సాగిపోతుంటే - అందమైన ఆ ముఖంవైపు - మెరిసే ఆ కళ్ళవైపూ - కదిలే ఆ పెదవులవైపూ అలా చూస్తూ ఉండిపోవాలని కోరిక...

మాష్టారు స్కూలుకెళ్ళాక పిల్లలచేత మాత్రలు పంపించారు. - జ్వరం తగ్గటానికి.

షబ్నం కళ్ళలో సన్నటి నీటిపొర - ఎంతటి శ్రద్ధ తనంటే !

"స్వీటీ - గులాబ్" అని పిలిస్తే ఎంత బావుంటుంది! అలా పిలిపించుకోవటం ఓ అపురూపమైన వరంలా అన్పిస్తుంది.

గులాబీ పూలు గుత్తులు గుత్తులుగా విచ్చుకున్నట్లనిపించింది మాష్టారి ఆలోచన...

"గులాబ్ - గులాబ్" అని పిలుస్తున్నట్లూ - "మై స్వీటీ - మై చైల్డ్" అని భుజంమీద చెయ్యేసి బుగ్గ గిల్లుతున్నట్లూ..

చెంప ఛెళ్ళుమంది. ఒక్కసారిగా ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది షబ్నం- ఎదురుగా భర్త ఖాసిం..

క్రూరంగా తనవైపే చూస్తున్నాడు - తినేసేలా.

"తల్లో గులాబీ పూలెట్టుకుని - వేశ్యలా సింగారించుకుని కూచున్నావేమే - ఎవరి గురించి కలలు కంటూ మైమరచిపోతున్నావే?"

షబ్నం షాక్‌లోంచి యింకా తేరుకోలేదు. తన ఎదురుగా ఉన్న వ్యక్తి అపరిచితుడిలా కన్పించాడో క్షణం.

కంఠంలో తీవ్రత - కోపం - అసహ్యమైన ముఖ కవళికలూ - తిట్లూ... ఉద్యానవనంలో పూలచెట్ల మధ్య విహరిస్తున్న రాజకన్యను ఎత్తుకొచ్చి గుహలో బంధించిన మాంత్రికుడు వీడేనా? క్రూరత్వం ఆ కళ్ళలో ఉందా? ఆ గడ్డంలో ఉందా - యింతకూ నా రాజకుమారుడేడి? "మై స్వీటీ" "గులాబ్" అంటూ రాడేం - తన అందమైన చిర్నవ్వుని విరజల్లడేం?

"ఏమిటే పలకవూ - ఎంత పొగరే నీకు" కాలితో బలంగా తన్నాడు ఖాసీం.

విరుచుకు పడిపోయింది గడపమీద - పొట్టలో కత్తులూ, బరిశెలూ దింపినంత బాధగా ఉంది.

చేతిలోని సంచిని విసిరి మొహంమీద కొట్టాడు.

"నేను తిరిగివచ్చే లోపల ఈ చేపల పులుసు చేసి ఉంచు" అని విసవిసా బైటికెళ్ళిపోయాడు.

దీర్ఘంగా నిట్టూర్చింది షబ్నం.

పెళ్ళయిన ఈ మూడేళ్ళలో ఎన్ని వందలసార్లు తల్చుకుందో మాష్టార్ని -

తను మాష్టార్ని ప్రేమిస్తున్న విషయం తనకు పదహారేళ్ళు వచ్చేవరకూ తెలియనే లేదు. ఆ పల్లెటూర్లో ఉన్నప్పుడు, తప్పిపోయిన పసిపిల్లాడికి అయాచితంగా దొరికిన మాతృమూర్తిలా అన్పించేవారు మాష్టారు.

ఏడో తరగతి పరీక్షలకు ముందే ఆ వూరు వదిలి పట్నం వచ్చేశారు షబ్నం వాళ్ళు.

షబ్నం కళ్ళలో ఆ రోజు మాష్టారి రూపం మెదిలింది. విషాదం నిండిన కళ్ళతో .... కన్నీళ్ళతో.. మాష్టారు షబ్నంని దగ్గరకు తీసుకున్నారు. ప్రేమగా తల నిమిరారు.

"గులాబ్ - చదువు మాత్రం ఆపొద్దమ్మా - నీకెపుడు ఏ సహాయం కావాలన్నా నేనున్నానని మర్చిపోకు" అన్నప్పుడు షబ్నం భోరుమని ఏడ్చేసింది. అమ్మ రోగాల్తో మంచం పట్టి చనిపోయినపుడూ - నాన్న యాక్సిడెంట్‌లో పోయినపుడు కూడా తనంత బాధగా ఏడ్వలేదు. అపుకోలేనంత ఏడుపు... అలా మాష్టార్ని చుట్టుకుని జీవితాంతం ఏడుస్తూ ఉన్నా బావుండు.

"మై స్వీటీ - మై లిటిల్ యేంజిల్" అని మాష్టారు బుగ్గగిల్లి వీడ్కోలు చెప్పినపుడు - అలా జీవితాంతం మాష్టారిచేత పిలిపించుకోవాలనే కోరిక...

పట్నం వాతావరణం షబ్నంకు నచ్చలేదు. తను పల్లెటూరి నించి అంత భద్రంగా తెచ్చుకున్న మాష్టారి జ్ఞాపకాల్లో ఉన్న తీపి మరెందులోనూ దొరకలేదు. కలలెప్పుడూ మాష్టారి గురించే - ఆలోచనంతా మాష్టారి గురించే.."ఈ కూడిక చూశావా గులాబ -తప్పుచేశావు"

అంటూనో "ఈ లెక్కను ఇలా కాదు చేయాల్సింది అనో, స్వీటీ! మొగల్ రాజ ప్రాసాదాల్లో పుట్టాల్సినదానివి" అనో అంటున్నట్లూ... కొన్నిసార్లు మాష్టారి నవ్వు తనకు విన్పిస్తుంది - అంతే వినిర్మలంగా - ప్రేమగా నవ్వే నవ్వు.

ఏ అర్ధరాత్రుళ్ళో ఖాసిం పశువాంఛకు బలై, నిస్త్రాణగా పడుకుని ఉన్నప్పుడు "గులాబ్' అని ఎవరో మృదుమధురంగా పిలిచినట్లు అన్పిస్తుంది.

షబ్నంకు పదహారేళ్ళు వచ్చేటప్పటికి ఓ నిర్ణయానికి వచ్చేసింది. పెళ్ళంటూ చేసుకుంటే లెక్కల మాష్టార్నే చేసుకోవాలని లేకపోతే జన్మవృధా అనుకుంది. తను ఏడో తరగతి చదివే రోజుల్లో మాష్టారు కుర్రవాడు - యింకా పెళ్ళికాలేదు. ఇప్పుడు అయిపోయిందేమోనని భయమేసేది. ఓ వేళ కాకున్నా తనను చేసుకుంటారా - వాళ్ళు బ్రాహ్మలు - తను తురక పిల్ల అని ఓ క్షణం సంశయించి, మరుక్షణం హాయిగా నవ్వుకునేది. "అలాంటి భేదాలు మాష్టారుకి లేవు, నన్ను స్వీటీ, గులాబ్ అంటూ దగ్గరకు తీసుకుంటారు" అని కలల్లో తేలిపోయేది.

ఓ రోజు తెగించి యింట్లో చెప్పాపెట్టకుండా పల్లెటూరు వెళ్ళింది - అప్పుడు తెల్సింది మాష్టారుకి రెండేళ్ళ క్రితమే ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోయారని. తను హతాశురాలైంది.

చెప్పకుండా వెళ్ళిపోయినందుకు యింట్లో మరోలా అర్థం చేసుకున్నారు.

"మదం బలిసి కొట్టుకుంటున్నావే" అని తిట్టింది అమ్మ.

అదే నెలలో ఖాసింతో తన పెళ్ళి తన ఇష్టానికి వ్యతిరేకంగా జరిగిపోయింది.

అయినా షబ్నం తన అన్వేషణ మానుకోలేదు. ప్రతి స్కూలు గడప తొక్కేది. "మీ లెక్కల మాష్టారి పేరేమిటి" అని అడిగి తెల్సుకునేది. "మీకు శర్మగారు తెలుసా - లెక్కల మాష్టారు శర్మ" అని వివరాలు చెప్పేది. ఖాసిం కొట్టినా సరే మానుకునేది కాదు.

"ఒక్కసారి - ఒకే ఒక్కసారి లెక్కల మాష్టారు కన్పిస్తేనా - లేచిపోతాను" అనుకుంది షబ్నం. వారికీపాటికే పెళ్ళయి ఉంటే ఆయన ఉంపుడు గత్తెగానైనా ఉంటాను అనుకుంది. దానికి వారూ, వారి భార్య ఒప్పుకోకపోతే మాష్టారి కాళ్ళ దగ్గిర దాసిదానిలా పడిఉంటాను.

"ఆ నవ్వు చాలదూ - శరీర సుఖమాతను కోరుకుందీ? కాదు. ఒక్క మృదుపలుకూ - ఆ చల్లని వాత్సల్యం - తీయటి పిలుపూ - చాలదూ -హాయిగా జీవించటానికి" అనుకుంది.

చేపల పులుపు వాసన కమ్మగా వస్తోంది.

షబ్నంలో ఓ అల్లరి ఆలోచన వచ్చింది - లెక్కల మాష్టార్ని పెళ్ళి చేసుకున్నాక తనేం చేస్తుంది - "మడి గట్టుకో మొగలాయి రాణీ" అంటారా - తను చేపల పులుసు కావాలని మారాం చేస్తుందా "మీరు కూడా కొద్దిగా రుచి చూడండి మాష్టారూ" అంటుందా - అపుడు మాష్టారు "యిదేం అల్లరి స్వీటీ - గులాబీ రేకుల్లా ఉన్న నీ చెక్కిళ్ళు గిల్లుతాను చూడు" అని అందంగా నవ్వుతారా?

"ఏమిటే నిలబడే కలలు కంటున్నావూ - రంకు మొగుడు గుర్తొచ్చాడా" తూలుకుంటూ వచ్చాడు ఖాసిం.

"జడలో ఆ గులాబీ పూలేమిటి అసహ్యంగా"

షబ్నం జడని ఒడిసి పట్టుకున్నాడు. గులాబీ పూలని విసురుగా లాగి, చేతితో నలిపి, కాలికింద వేసి కసిగా తొక్కాడు.

***

షబ్నంకు యాభై యేళ్ళు దాటాయి. ఖాసిం తాగి, తాగి లివర్ క్యాన్సర్‌తో చనిపోయాడు. మగపిల్లలిద్దరూ పెద్దవాళ్ళయి పెళ్ళిళ్ళు కూడా చేసుకున్నారు. మనవలూ - మనవరాళ్ళూ-

షబ్నం ఎవ్వరితో సరిగ్గా మాట్లాడదు. తన ఆలోచనల్లో తనుంటుంది. ఆ ఆలోచనలనిండా లెక్కల మాష్టారుంటారు.

"ఒకసారి - ఒకే ఒక్కసారి మాష్టారు కన్పించి 'గులాబ్' అంటేచాలు, తృప్తిగా చనిపోతాను' ' అనుకుంటూ ఉంటుంది.

"నేనింత మృదువుగా - సౌమ్యంగా మాట్లాడినా నాతో ఒక్కరూ మృదువుగా మాట్లాడరెందుకు' అని బాధపడుతూ ఉంటుంది.

కోడళ్ళు వండి పెడితే యింత తింటుంది. - పెట్టకున్నా పల్లెత్తు మాట అనదు.

ఆ పట్నంలోని ఒక్కో స్కూలుకు వెళ్తూ ఉంటుంది. "లెక్కల మాష్టారు తమరేనా బాబూ" అని లెక్కల మాష్టార్ని వెతికి పట్టుకుంటుంది.

"మీకు శర్మగారు తెలుసా - లెక్కల మాష్టారు - నా చిన్నప్పుడు మా పల్లెటూర్లో పాఠాలు చెప్పేవారు"

"ఏ శర్మగారు బాబవమ్మా - రామశర్మనా - ప్రభాకరశర్మనా - కృష్ణ శర్మనా?"

"శర్మ మాష్టారు తెలీదా - తేజస్సు నిండిన పెద్దకళ్ళు - లేత తమలపాకుల్లా పెదాలు - గోధుమవన్నెతో - అతి మృదువుగా, మధురంగా మాట్లాడేవారే - నన్ను స్వీటీ అని గులాబ్ అని పిల్చేవారూ -" షబ్నం కళ్ళు అరమోడ్పులౌతాయి.

ముగ్గుబుట్టలాంటి తల - మాసికలైన బట్టలు - తెల్లటి వెంట్రుకల్లో మెరుస్తూ ఎర్రటి గులాబీ - అందరూ పిచ్చిదనే అనుకుంటారు.

వెకిలిగా నవ్వుతారు - చిరాకుపడ్తారు లేదా విసుక్కుంటారు.

కొంతమంది కోప్పడి - కసురుకుంటారు.

"లెక్కల మాష్టారిలో ఉన్న సంస్కారం వీళ్ళకెక్కడినుంచి వస్తుందీ... ఎన్ని జన్మలెత్తినా మాష్టారంత మృదువుగా, మధురంగా మాట్లాడగలరా" అని తనలో తను గొణుక్కుంటూ ఉంటుంది షబ్నం. "గులాబ్" అనే తీయటి పిలుపు కోసం ఆమె పరితపిస్తూనే ఉంటుంది. లెక్కల మాష్టారి కోసం ఆమె కళ్ళు వెతుక్కుంటూనే ఉంటాయి.

● మందాకిని సెప్టెంబర్ 1995 ●